బీఆర్‌ఎస్‌తోనే తప్పిన చార్జీలు

- డిస్కంల ప్రతిపాదనలను ఈఆర్సీ తిరస్కరించడం అభినందనీయం
- కేసీఆర్ సంస్కరణలతోనే వెలుగులు
- ఖజానాను దెబ్బతీసి కాంగ్రెస్‌వాళ్లు జేబులు నింపుకొంటున్నరు
- ప్రజలను చూస్తుంటే సీఎంకు భయం
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, భిక్షమయ్యగౌడ్, కిశోర్, ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పోరాటంతోనే ప్రజలకు కరెంట్ చార్జీల పెంపు ముప్పు తప్పిందని, ఇది ముమ్మాటికీ బీఆర్‌ఎస్ పార్టీ విజయమేనని మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. కేసీఆర్ సర్కారు విద్యుత్తు సంస్కరణలు తెచ్చి వెలుగులు నింపితే, కాంగ్రెస్ సర్కారు కోతలతో ప్రజలను ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బూడిద భిక్షమయ్యగౌడ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నలమోతు భాస్కర్‌రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొంతకాలంగా ఈఆర్సీ ఎదుట వాదనలు వినిపించి చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై కరెంట్ భారం మోపకుండా కాపాడుకున్నామని చెప్పారు. కేసీఆర్ నేతృత్వంలో కడుపులు కాల్చుకొని పనిచేసి ఏటా 17 నుంచి 18 శాతం ఆదాయం పెంచామని, తెలంగాణ ఏర్పడ్డ తొలినాళ్లలో రూ. 60వేల కోట్ల బడ్జెట్‌ను రూ. 2.60లక్షల కోట్లకు చేర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ సర్కారు తెలివితక్కువ నిర్ణయాలతో ఆరు నెలల్లోనే రాష్ట్ర ఆదాయం నాలుగువేల కోట్లు తగ్గిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఖజానాను దెబ్బతీసి జేబులు నింపుకొంటున్నారని ఆరోపించారు. 'కేసీఆర్ పాలనలో కడుపుకట్టుకొని పనిచేసి వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తే..ఇప్పుడు చీటికి మాటికి కరెంట్ పోయే పరిస్థితి దాపురించింది' అని మండిపడ్డారు. వరికోతలు మొదలై నెల దాటినా ఇప్పటివరకు మిల్లర్లతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోలేదని చెప్పారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్నాలకే వర్తింపజేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. దేశంలోనే అత్యంత నాణ్యత కలిగిన తెలంగాణ పత్తికి కేంద్రం మద్దతు ధర ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. గుజరాత్‌లో క్వింటాకు రూ.8 వేలకు పైగా కొంటూ, మన పత్తికి కేవలం రూ.7521 మద్దతు ధర ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని ధ్వజమెత్తారు. తెలంగాణలో పండుగలప్పుడు నలుగురు కలిస్తే ఈ సర్కారు వణికిపోతున్నదని, అందుకే 163 సెక్షన్ పెట్టి ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేస్తున్నదని ఎద్దేవాచేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే దామగుండం, మూసీ ప్రాజెక్టు, అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ మీద మాట్లాడాలని హితవు పలికారు.

దావత్‌లు చేసుకుంటే దాడులా?

పండుగల వేళ ప్రజలు ఇండ్లల్లో దావత్‌లు చేసుకోవద్దా? విందులకు కూడా పర్మిషన్లు తీసుకోవాలా? అంటూ జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్ బంధువుల ఇంటిపై దాడులు చేయించిన రేవంత్‌రెడ్డి సాధించిందేమిటని నిలదీశారు. 'న్యాయం చేయాలని ఆందోళనకు దిగిన స్పెషల్ పార్టీ పోలీసులను తీసేసిన రేవంత్‌రెడ్డి, రేపు సాయుధ పోలీసులు తిరగబడితే ఏంచేస్తారు? చంద్రబాబుతో మాట్లాడి ఆంధ్రా పోలీసులను తెచ్చుకుంటారా?' అని చురకలంటించారు.

బీఆర్‌ఎస్ 'విద్యుత్తు' విజయం

- ప్రజలపై 18,500 కోట్ల విద్యుత్తు చార్జీల భారాన్ని మోపేందుకు సిద్ధమైన ప్రభుత్వం
- ఈఆర్సీ బహిరంగ విచారణలో వాదనలు వినిపించిన కేటీఆర్, బీఆర్‌ఎస్ నేతలు
- పెంపు ప్రతిపాదనను తిరస్కరించిన ఈఆర్సీ

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): ప్రజలపై ప్రభుత్వం మోపేందుకు సిద్ధమైన రూ. 18,500 కోట్ల విద్యుత్తు చార్జీల భారాన్ని ఆపడంలో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ అపురూప విజయాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో మంగళ, బుధవారాల్లో సంబురాలు చేసుకోవాలని గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లలో ఎన్నడూ విద్యుత్తు చార్జీలు పెంచలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పది నెలల్లోనే రూ. 18,500 మేర విద్యుత్తు చార్జీలు పెంచేందుకు ప్రయత్నించిందని తెలిపారు. ఈ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ప్రధాన ప్రతిపక్షంగా బహిరంగ విచారణలో పాల్గొని విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ)ని ఒప్పించగలిగామని కేటీఆర్ గుర్తుచేశారు. చార్జీల పెంపు ప్రతిపాదనను ఈఆర్సీ తిరస్కరించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను వినిపించి విజయం సాధించడం అసాధారణ అంశమని, ఈ చారిత్రాత్మక విజయాన్ని ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

ప్రజల తరపున వాదనలు

పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా తనతో పాటు విద్యుత్తుశాఖ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు ఈఆర్‌సీని కలిసి విద్యుత్తు చార్జీల పెంపును ఆపాలని కోరామని కేటీఆర్ తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో శాసనమండలిలో విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ పాల్గొని ప్రజల తరపున వాదనలు వినిపించిన విషయాన్ని గుర్తుచేశారు. తాను స్వయంగా సిరిసిల్లలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని ఈఆర్సీని ఒప్పించినట్టు తెలిపారు.

కానిస్టేబుల్ సూసైడ్ కలకలం

- ఇబ్రహీంపట్నం 3వ బెటాలియన్‌లో ఘటన

ఇబ్రహీంపట్నం రూరల్, అక్టోబర్ 29: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని 3వ బెటాలియన్‌లో ఉన్నతాధికారులు సెలవు ఇవ్వలేదని ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు యత్నించిన సంఘటన కలకలం సృష్టించింది. బెటాలియన్‌లో పనిచేస్తున్న నాగేశ్వర్‌రావు సెలవు ఇవ్వాలని మంగళవారం అధికారులను కోరగా నిరాకరించినట్టు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన కానిస్టేబుల్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా సిబ్బంది అడ్డుకున్నట్టు సమాచారం.

సస్పెండెడ్ కానిస్టేబుళ్లకు వేతనం నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): తమ డిమాండ్లను పరిష్కరించాలని టీజీఎస్పీ కానిస్టేబుళ్లు ఇటీవల ఆందోళనలు చేసిన నేపథ్యంలో సస్పెండైన, తొలగించిన, ఆందోళనలో పాల్గొన్నవారికి వచ్చే నెల నుంచి వేతనాలు నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 39 మందిని సస్పెండ్ చేసినా, 10 మందిని సర్వీసు నుంచి తొలగించినా, 21 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చినా.. వారిలో ఏమాత్రం భయం లేకపోవడంతో తమ దారికి తెచ్చుకునేందుకు ఇలా వేతనాలు ఇవ్వబోమని పోలీసు ఉన్నతాధికారులతో తేల్చి చెప్పినట్టు తెలిసింది. ఈ మేరకు ఆయా బెటాలియన్లలో ఆందోళనలు చేస్తున్న వారికి కమాండెంట్ల ద్వారా ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరావు

పోలీసుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ పౌరహక్కుల సంఘం డిమాండ్

హిమాయత్‌నగర్, అక్టోబర్ 29: బెటాలియన్ పోలీసుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జీ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సస్పెండ్ చేసిన 39మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సూచించారు. హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. బెటాలియన్ పోలీసులు, వారి కుటుంబ సభ్యులు చేస్తున్న పోరాటానికి పౌరహక్కుల సంఘం మద్దతునిస్తుందని ప్రకటించారు. ఏకీకృత పోలీస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సభ్యులు లింగన్న, విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులు.. ఆందోళనలు వద్దు

- ఏడీజీ స్వాతిలక్రా



హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు చెప్పి పరిష్కరించుకోవాలని ఏడీజీ స్వాతి లక్రా సూచించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 2న ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో ఆందోళనలు చేపట్టేందుకు హోంగార్డులు సిద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో.. వారి సమస్యలను 'నమస్తే తెలంగాణ' ఏడీజీతో ప్రస్తావించింది. ఆమె మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల కన్నా తెలంగాణలో హోంగార్డులకు అధిక వేతనం ఇస్తున్నట్టు చెప్పారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నాయకులు

హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ఎదుట సంబురాలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కేటీఆర్‌కు రుణపడి ఉంటాం

- సర్కారు విద్యుత్తు చార్జీల పెంపు ఉపసంహరణపై హర్షం
- బీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యంలో కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

సిరిసిల్ల టౌన్/హుజూరాబాద్ టౌన్/హనుమకొండ, అక్టోబర్ 29: విద్యుత్తు చార్జీలు పెంచుతామంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఈఆర్సీలో ఎండగట్టి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అండగా నిలిచిన కేటీఆర్‌కు రుణపడి ఉంటామని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్తు చార్జీల పెంపు నిర్ణయం ఉపసంహరణ, విద్యుత్తు సబ్సిడీ 10 హెచ్‌పీ నుంచి 25 హెచ్‌పీలకు వర్తింపజేస్తూ వెల్లడించిన ఈఆర్సీ ప్రకటనను స్వాగతిస్తూ బీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో మంగళవారం కేటీఆర్ చిత్రపటానికి కార్మికులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదేండ్ల కాలంలో ప్రభుత్వ సహకారంతో కేటీఆర్ సిరిసిల్ల నేతన్నల అభ్యున్నతికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ నాయకులు, రైతులు, ప్రజలతో కలిసి సంబురాలు నిర్వహించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి బైక్‌పై నక్కలగుట్టలోని టీజీఎన్పీడీసీఎల్ భవన్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న సుబేదారి, హనుమకొండ పోలీస్‌స్టేషన్ సీఐలు, పోలీసు సిబ్బంది కార్యాలయ గేట్లను మూసి వేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులు కార్యాలయం ఎదుట బాణసంచా కాల్చే క్రమంలో పోలీసులు వాటిని లాక్కునే ప్రయత్నం చేశారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగి టీజీ ఎన్పీడీసీఎల్ ఎదుట ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

హైడ్రామాలో సెకండ్ షో అట్టర్‌ఫ్లాప్

- విజయ్ మద్దూరి ఇంట్లో సోదాలు
- 4 గంటల పాటు రంధ్రాన్వేషణలు
- ఏమీ లేవని వెనుదిరిగిన పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): రాజకీయంగా ఎదుర్కోలేక కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న హైడ్రామాలో సెకండ్ షో కూడా అట్టర్‌ఫ్లాప్ అయింది. విజయ్ మద్దూరి ద్వారా రాజ్ పాకాలను ఫిక్స్ చేస్తూ ఆ తర్వాత కేటీఆర్ కుటుంబాన్ని అభాసుపాలు చేసేందుకు రేవంత్ సర్కార్ ముమ్మర ప్రయత్నం చేస్తున్నది. జన్వాడలోని రాజ్‌పాకాల ఇంట్లో జరిగిన కుటుంబ దావత్‌పై సైబరాబాద్ ఎస్‌వోటీ, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా, వేరువేరుగా దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయించేందుకు యత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలోనే మంగళవారం విజయ్ మద్దూరి ఇంట్లో సుదీర్ఘంగా పోలీసులు సోదాలు చేశారు. ఏమీ దొరక్కపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. తాను విదేశాల్లో ఉండగా డ్రగ్స్ తీసుకున్నానని, ఆ ఆనవాళ్లే వచ్చి ఉంటాయని, ఇక్కడ ఎలాంటి డ్రగ్స్ తీసుకోలేదని విజయ్ చెప్పినా పట్టించుకోకుండా కేసు నమోదు చేశారు. ఇతని ద్వా రా రాజ్ పాకాలను ఇరుకున పెట్టేందుకు పో లీసులు, ఎక్సైజ్ అధికారులు నానాయాగీ చేసి విఫలమైన విషయం తెలిసిందే. మంగళవా రం జుబ్లీహిల్స్‌లోని విజయ్ మద్దూరి ఇంట్లో నార్సింగి ఏసీపీ రమణగౌడ్ నేతృత్వంలో మోకిల పోలీస్ బృందం సోదాలు నిర్వహించింది. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సోదాలు కొనసాగాయి. విజయ్ తమకు తన ఫోన్ ఇవ్వలేదని, ఇతరుల ఫోన్ ఇచ్చాడని అతని ఫోన్‌తో పాటు ఇంట్లో డ్రగ్స్ అనవాళ్లు ఏమైనా ఉన్నాయా అనే అనుమానంతో సోదాలు నిర్వహించామని పోలీసులు వెల్లడించారు. ఫోన్‌తో పాటు ఎలాంటి డ్రగ్స్ దొరకలేదని తెలిపారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, నాయకులు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు, రామ్మూర్తి

కేటీఆర్ కేంద్రంగా కాంగ్రెస్ కుట్రలు

- జన్వాడ ఇంట్లో ప్లాన్ విఫలం కావడంతో ఈ-కార్ రేస్‌పై ఏసీబీ విచారణకు ఆదేశం
- ఏ విచారణకైనా, జైలుకైనా కేటీఆర్ సిద్ధమే
- మంత్రి పొంగులేటి బాంబు లీకులు ఇవేనా?
- మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రంగా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా విమర్శించారు. రాజ్ పాకాల ఇంట్లో తలపెట్టిన ప్లాన్ విఫలంతో.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచాలని నిర్వహించిన ఈ-కార్ రేస్‌పై ఏసీబీ విచారణకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదేశించినట్టు ఆరోపించారు. కేటీఆర్‌ను ఇరుకునపెట్టాలని, అబద్ధాలు చెప్పించి అయినా అరెస్టు చేయాలని చూస్తున్నట్టు పేర్కొన్నారు. ఏ విచారణకైనా, జైలుకు వెళ్లేందుకైనా కేటీఆర్ సిద్ధమేనని.. కానీ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో వెనుకడుగు వేయబోరని స్పష్టంచేశారు. మంగళవారం తెలంగాణభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు, బీఆర్‌ఎస్ నాయకుడు బొమ్మెర రామ్మూర్తితో కలిసి మీడియాతో మాట్లాడారు. దక్షిణకొరియా పర్యటనలో మంత్రి పొంగులేటి చెప్పిన బాంబులు ఇవేనా? అని మండిపడ్డారు. మూడ్రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ.. కుటుంబసభ్యులతో కలిసి దావత్ చేసుకుంటే ప్రభుత్వ పర్మిషన్ కావాలా? అని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్ నిలదీశారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధించిన కేసీఆర్ కుటుంబంపై ప్రతీకారాలు తీర్చుకునేందుకా అధికారమిచ్చింది? అని ప్రశ్నించారు. అభాండాలు, కుట్రలు చేస్తామంటే ప్రజలు రిటర్న్ గిఫ్ట్ ఇస్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలు ఫంక్షన్లు చేస్తే పోలీసులు ఇలాగే దాడులు చేస్తారా? అని నిలదీశారు.

జనగణనలో కులగణన చేపట్టాలి : ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది చేపట్టనున్న జనాభా లెక్కల్లో కులగణన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జేడీయూ, టీడీపీ, అప్నాదళ్, కాంగ్రెస్, వామపక్ష పార్టీలతోపాటు ఆర్‌ఎస్‌ఎస్, ప్రజాసంఘాలు ఈ దిశగా డిమాండ్ చేస్తున్నట్టు గుర్తుచేశారు. సుప్రీం తోపాటు 20 రాష్ట్రాల హైకోర్టులు కుల గణనకు అనుకూలంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు !

- ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమైన రాష్ట్ర ఎన్నికల సంఘం
- వచ్చే నెల 6 నుంచి కుల గణన

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కుల గణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత పరిస్థితుల్లో జనవరి తర్వాత లోకల్‌బాడీ ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉంది. వచ్చే నెల 6 నుంచి కులగణన ప్రారంభించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి

మూసీ పేరుతో దోచుకుంటే ఊరుకోం

- మూసీకి మూడు పేర్లు.. లక్షన్నర కోట్లా ?
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): మూసీ పేరుతో లక్షన్నరకోట్ల ప్రజాధనం దోచుకుంటే చూస్తూ ఊరుకోబోమని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి హెచ్చరించారు. మూసీ ప్రక్షాళన, మూసీ పునరుజ్జీవం, మూసీ సుందరీకరణ అంటూ మూడు పేర్లతో మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైడ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం మూసీ పునరుజ్జీవానికి కేటాయించిన రూ.16వేల కోట్లు సరిపోతాయని, ఎస్టిమేషన్ పెరిగితే రూ.25 వేల కోట్లు అవుతుందని అన్నారు. ఎంపీ చామలకు కనీస అవగాహన లేదని, నల్లగొండ జిల్లా ప్రజలను ఆయన చైతన్యం చేయడం ఏమిటి? అని నిలదీశారు. కేసీఆర్ పాలనలో నల్లగొండ రైతులు బాగుపడ్డారని, కాంగ్రెస్ పాలకులు మళ్లీ వారిని వలసలు వెళ్లేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

అంబుజా ఫ్యాక్టరీని నిలుపుదల చేయండి: చిరుమర్తి

రామన్నపేటలో తలపెట్టిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని నిలుపుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. ఈ పరిశ్రమ వస్తే ఎనిమిది గ్రామాల ప్రజల జీవనం దెబ్బతింటుందని, 4 వేల ఎకరాలు పడావుపడతాయని ఆందోళన వ్యక్తంచేశారు. అంబుజా ఫ్యాక్టరీ ఏర్పాటుపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు : పైళ్ల

మూసీ ప్రక్షాళనకు బీఆర్‌ఎస్ వ్యతిరేకం కాదని, సుందరీకరణ పేరుతో దోచుకోవాలని చూస్తే ఎక్కడికక్కడ ఎండగడతామని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎస్టీపీలు పెట్టామని, అవి సరిపోకపోతే మరిన్ని ఏర్పాటుచేసి మూసీ జలాలను శుద్ధి చేయాలని అన్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏవో ఖలీలుల్లా, జేఏ సుధాకర్

పెండింగ్ బిల్లు కోసం 3 లక్షలు లంచం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 29 : పెండింగ్ బిల్లులు చేసేందుకు ఓ ఏజెన్సీ నిర్వాహకుడి నుంచి రూ.3 లక్షలు లంచం తీసుకుంటూ మెడికల్ కాలేజీ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపిన వివరాలు.. కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఓ ఏజెన్సీ ద్వారా 49 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారి పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు వైద్య కళాశాల అకౌంట్స్ ఆఫీసర్ ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ సదరు ఏజెన్సీ నిర్వాహకుడి నుంచి రూ.7 లక్షలు డిమాండ్ చేయగా రూ.3 లక్షలు చెల్లిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

పట్టుబడిన వెంకోబ

ఏసీబీకి పట్టుబడ్డ ఏఈఈ వెంకోబ

బండ్లగూడ, అక్టోబర్ 29: రాజేంద్రనగర్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకోబ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) పోలీసులకు పట్టుబడ్డారు. వెంకోబ నెల క్రితమే రాజేంద్రనగర్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం నుంచి సర్కిల్ 14కు బదిలీ అయ్యారు. రాజేంద్రనగర్‌లో పరిధిలో ఎంబిల్ రాసేందుకు ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేలు డిమాండ్ చేశారు. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను సంప్రదించారు. వారి సూచనల మేరకు వెంకోబకు కాంట్రాక్టర్ డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంకోబ రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో పదేండ్లకుపైగా పనిచేశారు.

పోలీసులకు సరెండర్ లీవ్స్ బడ్జెట్

- 182.48 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు
- ఇటీవల 'పోలీసుల పొట్టగొడుతున్న ప్రభుత్వం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రత్యేక కథనం
- పోలీసు అధికారుల సంఘాల హర్షం

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్ల బడ్జెట్ రూ.182.48 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎంతోకాలంగా పోలీస్ సిబ్బంది సరెండర్ లీవ్‌లకు సంబంధించిన బడ్జెట్‌ను విడుదల చేయాలని కోరుతున్నారు. ఇటీవల బెటాలియన్ కానిస్టేబుళ్ల ఉద్యమించిన డిమాండ్లలో సరెండర్స్ బడ్జెట్ కూడా ఒకటి. సివిల్, ఏఆర్ పోలీసుల్లోనూ అసంతృప్తి నెలకొన్న నేపథ్యంలో సరెండర్ లీవ్స్ బడ్జెట్‌ను విడుదల చేసింది. పెండింగ్ బిల్లుల గురించి ప్రస్తావిస్తూ 'నమస్తే తెలంగాణ' ఇటీవల 'పోలీసుల పొట్టగొడుతున్న ప్రభుత్వం' పేరుతో కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి మంచి స్పందన రావడంతో సరెండర్ లీవ్ల బడ్జెట్ రూ.182.48 కోట్లను విడుదల చేసింది. పోలీసు సిబ్బంది, సంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

డీఏల సంగతేమిటి?

పోలీసులకు చెల్లించాల్సిన డీఏలు ఐదు ఉండగా.. ఇటీవల దీపావళికి ఒక డీఏ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మిగతా డీఏలతోపాటు పెండింగ్ బిల్లులు, వారాంతపు సెలవును మంజూరు చేయాలని పోలీసులు కోరతున్నారు.

మంత్రి సురేఖపై కేటీఆర్ కేసులో నేడు సాక్షుల వాంగ్మూలాల నమోదు

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో బుధవారం నాంపల్లి కోర్టు మరికొందరు సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయనున్నది. ఈ కేసులో ఇప్పటికే కేటీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ వాంగ్మూలాలను నమోదు చేసిన ప్రజాప్రతినిధుల కోర్టు.. ఇప్పుడు తుల ఉమ, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్ వాంగ్మూలాలను రికార్డు చేయనున్నది. కాగా, సినీనటుడు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసులో వివరణ ఇచ్చేందుకు మంత్రి కొండా సురేఖ బుధవారం కోర్టుకు హాజరుకావాల్సి ఉన్నది.

డ్రగ్‌టెస్ట్‌కు మేం రెడీ.. మీరు సిద్ధమా?

- కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు రావాలి?
- బీఆర్‌ఎస్ 28 మంది ఎమ్మెల్యేలం వస్తాం
- బీఆర్‌ఎస్ నేతల ఫోన్లను ట్యాప్ చేస్తున్నారు
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫైర్



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, పక్కన రాకేశ్‌రెడ్డి, సోహైల్

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. బీఆర్‌ఎస్ 28 మంది ఎమ్మెల్యేలు డ్రగ్ టెస్ట్‌కు సిద్ధమని బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రకటించారు. అయితే డ్రగ్ టెస్ట్‌కు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా రావాలని.. మంగళవారం రాత్రి 8 గంటల్లోగా ఎక్కడికి రావాలో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రముఖ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమక్షంలో అందరం టెస్టు చేయించుకుందామని, ఒకవేళ మీరు రాకపోతే డ్రగ్స్ తీసుకుంటున్నట్టు భావిస్తామని చెప్పారు. తెలంగాణభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల తొలినాళ్లలో తనను రేవంత్‌రెడ్డి డ్రగ్స్ కేసులో ఇరికించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. తాజాగా రాజ్ పాకాల ఇంట్లో కూడా ఇదే జరిగిందని, కేటీఆర్ ఫంక్షన్ వస్తారనుకొని ఇరికించాలని రేవంత్‌రెడ్డి ప్లాన్ చేశారని ఆరోపించారు. తనతో సహా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు నేతల ఫోన్లు ట్యాప్ చేస్తున్నదని నిజం కాదా? అని నిలదీశారు. రేవ్ పార్టీలో వృద్ధులు, చిన్న పిల్లలు ఉంటారా? అని పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. కొందరు కావాలని రాజ్ పాకాల ఇండ్లలోకి వెళ్లిన ఫంక్షన్‌ను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. వ్యక్తిగతంగా ఇబ్బంది పెడితే రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్, దుబాయిలో ఏం చేశారో చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. అప్పుడు రేవంత్‌రెడ్డిని ఇంట్లోకి రానివ్వరని తెలిపారు.